క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని గురువారం ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సేవలను మరింత మెరుగుపరిచేందుకు ప్రయాణికుల సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలను నంబర్: 9100941850కు ఫోన్‌చేసి తెలపాలని కోరారు. సురక్షిత ప్రయాణాలకు ఆర్టీసీని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

జాగ్రత్తలు తీసుకోవాలి


రైతులకు మాట్లాడుతున్న ఏఓ

కల్లూరు(పులిచెర్ల): తుపాన్ సమయంలో రైతులు పంటలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంట చేతికొచ్చిన పొలాల్లో నీటిని పూర్తిగా తొలగించాలని తెలిపారు. పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు తోడేయాలన్నారు. తుపాన్ సమయంలో పంట కోత కోయకూడదన్నారు. వరి కంకులు నేలకు వాలకుండా చూడాలని తెలిపారు. కుప్పలు వేసిన వరికి ఉప్పు ద్రావణాన్ని చల్లాలని, వర్షానికి గింజలు రంగు మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం


మాట్లాడుతున్న కాంతమ్మ

బైరెడ్డిపల్లె: మంచి ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతంగా ఉంటారని తీర్థం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ అన్నారు. ఆరోగ్య భద్రతా దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని దాసార్లపల్లెలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారాన్ని వృథా చేయకుండా మంచి ఆహారం తీసుకోవాలన్నారు. ఆహారం ఎక్కువగా తినడం వలన శరీరానికి, ఆర్థికంగా నష్టం జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్య సలహాలను తప్పకుండా పాటించాలని సూచించారు. ఆరోగ్యసిబ్బంది నవీన, కవిత పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

సదుం: బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ షేక్‌షావలి హెచ్చరించారు. బస్టాండులో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలను బుధవారం ఆయన తీయించివేశారు. ఇకపై ఎవరైనా కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు రోడ్డుపై నిలిపితే జరిమానా విధిస్తామని చెప్పారు. అనంతరం వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు.

పరిపాలనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ

సదుం: పంచాయతీ పరిపాలనపై ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఈఓపీఆర్డీ వరప్రసాద్ ఆధ్వర్యంలో రెండవ రోజూ శిక్షణ కార్యక్రమం కొనసాగింది. వైస్ సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు పంచాయతీ పరిపాలన, సమావేశాల నిర్వహణ, అభివృద్ధి పనుల తీర్మానాలపై ఆయన అవగాహన కల్పించారు.

యాదమరిలో ప్రారంభమైన ఫెన్సింగ్ పోటీలు


ఫెన్సింగ్ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

యాదమరి(పూతలపట్టు): యాదమరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా ఫెన్సింగ్(కత్తిసాము) పోటీలను జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి వసంతవాణి ప్రారంభించారు. అండర్16, 17 ఫెన్సింగ్ పోటీలకు జిల్లాలోని బాలబాలికలు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20, 21, 22 నంద్యాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, పీడీలు కృష్ణయ్య, సిరాజ్ అహ్మద్, శరత్, నూర్ మొహ్మద్, ఉమాపతి, కోచ్‌లు రవి, కార్తీక్ పాల్గొన్నారు.

టమాటాకు ముసురు దెబ్బ

- భారీగా తగ్గిన టమాట ధరలు
- ఉన్నట్టుండి రూ.1000 నుంచి రూ.400కు ధరల పతనం
- తుపాను కారణంగా మరింత తగ్గనున్న ధరలు
- వర్షాలు, తెగుళ్లతో తగ్గిన పంట దిగుబడి


కోత కోసి కుప్ప పోసిన టమాట


పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

పలమనేరు: ముసురు వర్షం టమాట రైతుల కొంపముంచింది. నిన్నటి దాకా బాక్సు ధర రూ.వెయ్యి దాకా ఉండగా వర్షం కారణంగా ధరలు అమాంతం పడిపోయాయి. పలమనేరు మార్కెట్‌లో బుధవారం టమాట బాక్సు ధర రూ.400కు చేరింది. ఇలాగే ముసురు వర్షం మరో మూడు రోజులు పడితే టమాట రైతులకు మరింత నష్టం వాటిల్లే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి తోడు సూర్యరశ్మి లేకపోవడంతో పంటకు ఆకుమచ్చ తెగుళ్లు సోకి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని టమాట రెతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరలున్న సమయంలో ముంచిన వాన...

జిల్లాలో గత నెల రోజులుగా టమాట ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పలమనేరు టమాట మార్కెట్‌లో వారం రోజులుగా పెరుగుతూ వచ్చి 14కిలోల బాక్సు ధర రూ.1000కి చేరుకుంది. ఇదే సమయంలో ముసురు వర్షం కారణంగా టమాట క్వాలిటీ తగ్గి సరుకు నాణ్యత తగ్గుముఖం పట్టింది. దీంతో ఉన్నట్టుండి బాక్సు ధర రూ.400కు పడిపోయింది. ఇలాగే వర్షం పడితే ధరలు మరింత తగ్గే అవకాశం ఉంటుందని టమాట మండీ వ్యాపారులు చెబుతున్నారు.

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో సాగు వివరాలు

- ప్రస్తుతం టమాట సాధారణ సాగు 5వేల హెక్టార్లు
- సాగైన పంట: 1,600 వందల హెక్టార్లు
- ఇప్పుడు కోత దశలో ఉన్న తోటలు: 800 వందల హెక్టార్లు
- ఏటా ఈ సీజన్‌లో మండీలకు వచ్చే సరుకు: 110 లారీ లోడ్లు
- ప్రస్తుతం మార్కెట్లకు చేరుతున్న సరుకు: 60 లోడ్లు

పంటకు తప్పని తెగుళ్ల దెబ్బ

వర్షం కారణంగా ఇక్కటి టమాట తోటలకు ఎర్లీబ్లైట్, లేట్‌బ్లైట్ అనే తెగుళ్ల సోకాయి. దీంతో కోతలకు సిద్ధంగా ఉన్న టమాటాల్లో క్వాలిటీ తగ్గింది. ఫలితంగా నాణ్యత తగ్గిన టమాటాకు మార్కెట్‌లో ధర పలకడం లేదు. మరో మూడు రోజులు ముసురు వర్షం ఇలాగే ఉంటే ధరలు భారీగా పతనం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

వర్షాలతో టమాటాకు నష్టమే..



టమాట పంటకు ముఖ్యంగా సూర్యరశ్మి ఉండాలి. మూడు రోజులుగా వర్షాల కారణంగా గాలిలో తేమ శాతం బాగా తగ్గింది. ఫలితంగా టమాట తోటల్లో వైరస్ ప్రభావం పెరిగి పంట క్వాలిటీ దెబ్బతింటుంది. దీంతో ఇలాంటి కాయలకు మార్కెట్‌లో మంచి ధర లభించదు. రైతులు తోటల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలి. మొక్కలు నీటిలో నానకుండా, కాయలు కుళ్లిపోకుండా చర్యలు తీసుకోవాలి.

–డా. కోటేశ్వరావు, ఉద్యానశాఖ సహాయ సంచాలకులు

నీళ్ల నిల్వ ఉంటేనే ఇబ్బంది..



టమాటాను మెట్ట భూముల్లో పండించిన రైతులకు పెద్దగా ముసురు వర్షం వలన ఇబ్బంది లేదు. ముఖ్యంగా కీలేర్లు, నీళ్ల నిల్వ ఉండే భూముల్లో టమాటాను సాగి చేసిన వారికి వర్షంతో ఇబ్బందులు తప్పవు. కేవలం రెండు రోజుల్లోనే పంట క్వాలిటీ తగ్గుతుంది. దీనికి తోడు వైరస్ తెగుళ్లు ఆశిస్తాయి. ఫలితంగా పంట దిగుబడి బాగా తగ్గుతుంది. ఈ వర్షం కారణంగా టమాట రైతులకు మాత్రం తీవ్రంగా నష్టం తప్పదు.

–బుజ్జి, టమాట రైతు, బైరెడ్డిపల్లి

సకాలంలో పన్నులు చెల్లించండి

పుంగనూరు: మున్సిపాలిటీలోని భవన యజమానులు ఆస్తి, నీటి పన్ను సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో గత నెలలో రూ.40లక్షలు వసూలు చేశామన్నారు. ఈనెలలో ఇప్పటి వరకు రూ.22 లక్షలు వసూలు చేశామని పేర్కొన్నారు.. అలాగే మార్కెట్ కమిటీ నుంచి వారి బకాయిలను రూ.4.21 లక్షలు వసూలు చేశామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి కూడా పన్నులు వసూలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఆస్తి, నీటి పన్ను విషయంలో సచివాలయ ఉద్యోగులతో పాటు మున్సిపల్ ఆర్‌ఐ, సిబ్బందిని కేటాయించి, ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని ఆయన తెలిపారు. ప్రజలందరూ సకాలంలో పన్నులు చెల్లించి, మున్సిపాలిటీని ఆదర్శవంతంగా నిలిపేందుకు సహకరించాలని కోరారు.

పౌష్టికాహారమే శ్రీరామరక్ష

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పౌష్టికాహారమే తల్లీ బిడ్డకు శ్రీరామరక్ష అని అపోలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ లోకేశ్వరి అన్నారు. నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న ప్రసూతి విభాగంలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. పలు రకాల ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లు, తినుబండారాలను ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ గర్భిణులు తాజా ఆకుకూరగాయలు, పండ్లు తీసుకోవాలన్నారు. సరైనా పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. గర్భిణులు వైద్యులు సూచనలు, సలహాలు పాటించి తీసుకునే ఆహార విషయాల్లో నిర్లక్ష్యం వద్దన్నారు.

క్వాలిఫైడ్ డాక్టరైనా అనుమతి తప్పనిసరి



ఆరోగ్య ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, టీకాలేస్తాం అని రాసిన బోర్డు

- పలమనేరులో జిల్లా వ్యాక్సినేషన్ అధికారి తనిఖీలు
- ప్రైవేట్ వైద్యులకు హెచ్చరిక

పలమనేరు: ఎంబీబీఎస్ చదివిన క్వాలిఫైడ్ డాక్టర్లు అయినా డీఎంహెచ్‌ఓ అనుమతులు తప్పనిసరని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతరావు అన్నారు. డీఎంహెచ్‌ఓ నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోకుండా మెడికల్ షాపు నిర్వాహకుల వద్ద డాక్టర్లుగా సేవలందిస్తే చర్యలు తప్పవని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతరావు హెచ్చరించారు. ఆమేరకు ఆయన కొందరు క్వాలిఫైడ్ డాక్టర్లు సైతం పట్టణంలో అనధికారికంగా సేవలందిస్తున్నారనే విషయమై బుధవారం ఇక్కడి ఆరోగ్యశాఖ అధికారులతో కలసి తనిఖీలు నిర్వహించారు. మరికొందరు మెడికల్స్ షాపు నిర్వాహకులు క్వాలిఫైడ్ వైద్యులను పిలిపించుకొని వారి షాపు పక్కనే రోగులకు సేవలందిస్తూ చిన్నారులకు టీకాలు సైతం వేస్తామంటూ దోపిడీ చేస్తున్నారనే సమాచారంతో ఆయన పట్టణంలోని ఆరోగ్యక్లినిక్‌ను తనిఖీ చేశారు. చిన్నపిల్లలకు వ్యాధి నివారణ టీకాలను ప్రభుత్వం ఉచితంగానే అందిస్తోందని వీటి కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరంలేదన్నారు. ఆయన వెంట డాక్టర్లు ఆశా, నిరంజన్, సబ్ యూనిట్ అధికారి జయశంకర్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజలో అధికారులు, నేతలు

వి.కోట: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పాముగానిపల్లి, బైరుపల్లి పంచాయతీలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మండల అధికారులు హాజరై భూమిపూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాముగానిపల్లి పంచాయతీలోని గుమ్మిరెడ్డిపల్లి రోడ్డు నుంచి వేణుగోపాలపురం వరకు రూ.72 లక్షలతో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన బీటీ రోడ్డు పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా బైరుపల్లి పంచాయతీలో నాయకనేరి రోడ్డు నుంచి బైరుపల్లి వరకు రూ.1.77 లక్షలతో మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈపీఆర్ శ్రీనివాసులు, ఏపీఓ అశోక్‌రెడ్డి, పాముగానిపల్లి సర్పంచ్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

డ్రిప్ విధానాన్ని ప్రోత్సహించాలి


నలగాంపల్లెలో డ్రిప్ వినియోగంపై జేసీకి వివరిస్తున్న ఉద్యానవన అధికారులు

బంగారుపాళెం: పంటల సాగులో రైతులకు డ్రిప్ విధానాన్ని ప్రోత్సహించాలని జేసీ విద్యాధరి అధికారులను ఆదేశించారు. మండలంలోని నలగాంపల్లెలో బుధవారం సాయంత్రం సూక్ష్మ సాగునీటి పథకం కింద లబ్ధి పొందిన రైతు పొలాన్ని ఉద్యానశాఖ అధికారులతో కలసి జేసీ సందర్శించారు. డ్రిప్ విధానం ద్వారా పంటలకు నీరు అందించే విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ, డ్రిప్ విధానం గురించి రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సన్న, చిన్న కారు రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా కృషిచేయాలన్నారు. ప్రభుత్వం డ్రిప్ పరికరాలపై అందించే రాయితీలను గురించి రైతులకు వివరించాలన్నారు. డ్రిప్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఏపీఎంఐపీ పీడీ సుబ్రమణ్యం, తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఉద్యానశాఖ అధికారి సాగరిక పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి


ఏరియా ఆస్పత్రిలో వికాస్ మర్మత్

కుప్పం: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కుప్పం కడా పీడీ వికాస్ మర్మత్ వైద్యులను ఆదేశించారు. బుధవారం ఆయన కుప్పం ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. వికాస్ మర్మత్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు పేదలు వస్తారని, వైద్యులు వీరి పట్ల సేవాభావంతో మెలగాలన్నారు. కుప్పం ముఖ్యమంత్రి నియోజకవర్గం కావడంతో అందుకు అనుగుణంగా సేవలు ఉండాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, ఉచిత భోజనం సదుపాయాల్లో ఎక్కడా లోటు లేకుండా చూడాలన్నారు. ఏరియా ఆస్పత్రి వైద్యులు ఉన్నారు.

కార్యాలయం పరిశీలన


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ కార్యాలయాన్ని జిల్లా ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ బుధవారం పరిశీలించారు. తొలుత ఈఈ మునిచంద్రతో కలసి డీఈ, ఏఏఓ, జేఏఓ, ఏఈలతో సమావేశమయ్యారు. తుపాను నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పూర్తిచేయాలని కోరారు. ఈ సమయంలో మరింత వేగంగా స్పందించాలని చెప్పారు. చిన్నపాటి విద్యుత్ ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఈఆర్వో కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. సబ్‌స్టేషన్ పరిశీలించి ఫీడర్ల వారీగా ఏప్రాంతాలకు సరఫరా ఇస్తున్నారో అడిగారు. కార్యక్రమంలో డీఈలు ప్రసాద్, ఆనంద్, శేషాద్రి, ఏఏఓ గీత, జేఏఓ గోవిందరాజులు, ఏఈలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పచ్చదనానికి ప్రాధాన్యం


కలెక్టరేట్‌లో ఏర్పాటు చేస్తున్న ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్

చిత్తూరు కలెక్టరేట్: చాలా సంవత్సరాల తర్వాత కలెక్టరేట్‌లో పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ప్రత్యేక చొరవతో కలెక్టరేట్‌లోని ప్రాంగణాలు, భవనాల మరమ్మతులకు చర్యలు చేపడుతున్నారు. కలెక్టరేట్‌లో ఖాళీగా ఉన్న ప్రదేశంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్ ఏర్పాటు చేస్తున్నారు. 2004 సంవత్సరం తర్వాత ప్రస్తుతం కలెక్టరేట్ భవనానికి పెయింటింగ్, మరమ్మతుల పనులు చేపడుతున్నారు.

అప్రమత్తతతో నష్ట నివారణ


రైతులతో మాట్లాడుతున్న సంతోషికుమారి

సదుం: తుపాన్ ప్రభావంతో భారీ వర్షాల నేపథ్యంలో ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హార్టీకల్చర్ అధికారి సంతోషి కుమారి సూచనలు చేశారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంటలను నష్టపోకుండా చూడవచ్చునని వెల్లడించారు.

పంటల సాగు వివరాలు:

మండలం	పండ్ల తోటలు	టమాట	పూల తోటలు(ఎకరాలలో)
చౌడేపల్లె	2,500	300	54
సోమల	5,000	500	45
సదుం	5,500	150	60
పులిచర్ల	12,000	80	15
రొంపిచర్ల	5,200	280	20

టమాట: టమాట పంటలో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు. కర్రల సాయంతో మొక్కలకు ఊతం ఇవ్వాలి. వర్షం సమయాల్లో కోతలు చేయరాదు. కోతలకు సిద్ధంగా ఉన్న వాటిని కోసి సరైన గాలి ప్రసరించే ప్రదేశాలలో నిల్వ చేయాలి. అధిక వర్షాల వల్ల వచ్చే మచ్చ తెగులు రాకుండా ముందు జాగ్రత్తగా 2.5 గ్రాముల డైథైన్ ఎం.45, 1 గ్రాము కార్బండిజం లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

బంతి, చామంతి: ఈపంట పొలాల్లో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నీరు నిలిస్తే వేరు కుళ్లి తెగుళ్లు వ్యాపిస్తాయి.

బొప్పాయి: కోతకు సిద్ధంగా ఉన్న బొప్పాయిని ముందుగానే కోసి విక్రయించుకోవాలి. కోతకు వచ్చిన పండ్లను ప్యాక్ హౌస్‌లలో నిల్వ ఉంచుకోవాలి.

అరటి: అరటి తోటల్లో గెలలు ఉన్న రైతులు పెనుగాలులతో వచ్చే వర్షం వల్ల చెట్లు పడిపోకుండా ముందు జాగ్రత్తగా కర్రల సాయంతో ఊతం ఇవ్వాలి. కోతకు వచ్చిన గెలలను ముందుగానే కోసి విక్రయించుకోవాలి.

మామిడి: వర్షం కారణంగా మామిడి పంటకు నష్టం చేకూరకపోయినా.. అధిక గాలులు వీస్తే కొమ్మలు విరిగి చెట్లు పడిపోయే ప్రమాదం ఉంది. ఆఫ్ సీజన్‌లో పూత ఉన్న చెట్లలో అది రాలిపోతుంది.

ఇతర కూరగాయలు సాగు చేసే రైతులు తోటల్లో నీరు నిల్వ ఉండి పంటలు కుళ్లిపోకుండా వర్షం నీరు బయటకు పోయేలా జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో ద్వారా ఉద్యానవన తోటలకు నష్టం చేకూరకుండా సంరక్షించుకోవాలని అధికారులు చెప్పారు.

తుపాన్ దెబ్బకు కూలిన చెట్లు


మోటుమల్లెలమిట్టపల్లె వద్ద చెట్టును తొలగిస్తున్న సిబ్బంది


కోటూరు వద్ద నేలకొరిగిన వరి

- మూడు కుటుంబాలు పునరావాస కేంద్రాలకు తరలింపు

రొంపిచెర్ల: తుపాన్ దెబ్బకు రొంపిచెర్ల– గానుగచింత మార్గంలోని మోటుమల్లెల మిట్టపల్లె వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలి పడింది. గ్రామస్తుల సమాచారం మేరకు తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే కూలీలను ఏర్పాటు చేసి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని గర్నిమిట్టవారిపల్లెలో గుడిసెల్లో ఉంటున్న మూడు కుటుంబాలను ముందు జాగ్రత్తగా పునరావాస కేంద్రానికి తరలించారు. వారికి బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పెద్దమల్లెల గ్రామ పంచాయతీ పాతపేట రోడ్డులో వర్షపు నీరు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటికప్పుడే జేసీబీతో పూడిక తొలగించి రోడ్డుపై నీరు లేకుండా చేశారు. తుపాన్ దెబ్బకు మండలంలో టమాట, వరి పంటలు దెబ్బతిన్నాయి. వీఆర్వోలు మహేష్, ప్రసాద్, కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.


గర్నిమిట్టవారిపల్లెలో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న అధికారులు

వర్షం.. పంటలకు నష్టం

చౌడేపల్లె: తుపాన్ కారణంగా మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి వరి, పూలు, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. వర్షానికి వరి నేలకొరగడంతో తీవ్రనష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. శెట్టిపేట, చారాల, కొండామర్రి, కాగతి, పెద్దయల్లకుంట్ల, ఏ.కొత్తకోట, దుర్గసముద్రం ప్రాంతాల్లో 500 ఎకరాల్లో పంట నేలకొరిగింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.